క్లుప్తంగా

బీపీఎం డిగ్రీతో ఉద్యోగావకాశాలు



వక్తలను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఐటీ బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) డిగ్రీ కోర్స్‌తో పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చని డబ్ల్యూఎస్ఎస్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఎల్.నారాయణ అన్నారు. స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రొఫెషనల్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌ను కళాశాల స్థాయిలోనే మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా ఆల్ఫా న్యూమరిక్ స్కిల్స్, కమ్యూనికేషన్ సాఫ్ట్ స్కిల్స్‌పై విద్యార్థులు పట్టుసాధిస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. సదస్సులో నాస్కామ్–రీజినల్ లీడ్ అకడమిక్–గవర్నమెంట్ రిలేషన్స్ ఎం.ఆర్.బి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఉచితంగా అందించే ఫ్రీ సర్టిఫికేషన్ కోర్స్‌లు చేసి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. అనంతరం ముఖ్యవక్తలను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ఏవీపీ–టాలెంట్ అక్విజిషన్ గ్లోబల్ సెర్వీస్ ప్రతినిధి రామ్‌నారాయణ్ చౌరస, కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎన్‌సీసీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎల్.టి.ఎం.ఉదయ్‌కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూర్యనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘం భవనానికి స్థలం కేటాయించండి



ఎమ్మెల్యే లలిత కుమారికి వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

లక్కవరపుకోట: మండల కేంద్రంలో పట్టాలమ్మ నాయీ బ్రాహ్మణ సంఘం భవనానికి స్థలం కేటా యించాలని కోరుతూ సంఘ సభ్యులు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఎమ్మెల్యేను ఆమె నివాసంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ సభ్యులు మాట్లాడుతూఎన్నో ఏళ్లుగా కుల వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని, సంఘం సమావేశాలు నిర్వహించుకునేందుకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించి నిర్మా ణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తహసీల్దార్‌తో చర్చించి భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తా మని హామీ ఇచ్చారు.

మద్యం దుకాణం వద్దంటూ వినతి



పంచాయతీ ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న గౌరీశంకర్ కాలనీ మహిళలు

శృంగవరపుకోట: అటు గుడి..ఇటు బడి.. ఎదురుగా పంచాయతీ కార్యాలయం, మరోపక్క నిత్యం రద్దీగా ఉండే ప్రకాశం మార్కెట్ ప్రాంతంలో మద్యం దుకాణం పెడితే మరిన్ని తగువులు, కొట్లాటలు జరిగి జనం ఇబ్బందులు పడతారని, మద్యం దుకాణం వద్దంటూ గౌరీశంకర్‌కాలనీ మహిళలు అధికారులకు మొరపెట్టుకున్నారు.మద్యం దుకాణం ఏర్పాటును మహిళలు సోమవారం అడ్డుకోగా...స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, పంచాయతీ కార్యాలయంలో ఈఓకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. హరిజన వీధి, గౌరీశంకర్‌కాలనీ, యాతవీధి, కోటవీధి, వేమలివీధి, సాలివీధి ప్రజలంతా కలిసే మార్కెట్ వద్ద దుకాణం ఏర్పాటు సరైన ఆలోచన కాదని చెప్పారు. తమ అభ్యంతరాలను ఉన్నతాధికారులకు తెలియజేసి దుకాణం ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలని కోరారు.

ఘనంగా గౌరమ్మ సంబరాలు



పార్వతీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న కుమరాం గ్రామస్తులు

జామి: మండలంలోని కుమరాం గ్రామంలో గౌరమ్మ సంబరాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గ్రామస్తులు వరి దుబ్బులను గౌరీదేవిగా అలంకరించి, పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు.అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.నాగులు చవితిరోజున నిమజ్జనం చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

సరస్వతీ నిలయంలో సమస్యల తిష్ట



గుంతలు, మట్టిదిబ్బలతో పాఠశాల మైదానం

- రక్షణగోడ లేక ఇబ్బందులు
- ఎండలోనే విద్యార్థుల సైకిళ్లు
- పాఠశాల చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలు
- మైదానంలో గుట్టలుగా మట్టిపోగులు

విజయనగరం రూరల్: పాఠశాలల్లో సరైన వసతులు ఉంటే విద్యార్థులు చదువులపై దృష్టి సారించగలరు. లేదంటే సమస్యలతో సతమతమవుతూ చదువుపై ఏకాగ్రత పెట్టలేరు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తున్నామని ప్రభుత్వం చెపుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అవేవీ కానరావడం లేదు. ఇందుకు విజయనగరం మండలం అయ్యన్నపేట ప్రభుత్వ ఆదర్శ పాఠశాలే ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. పాఠశాలలో విద్యార్థుల హాజరు బాగానే ఉన్నా.. మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో జంతువులు పాఠశాల ఆవరణలోకి వచ్చేస్తున్నాయి. సైకిళ్లను పార్కింగ్ చేసేందుకు షెడ్ లేకపోవడంతో విద్యార్థుల సైకిళ్లు ఎండకు, వానకు తడిసి పాడవుతున్నాయి. ఉదయం సైకిల్ తొక్కుకుంటూ హుషారుగా పాఠశాలకు వచ్చే విద్యార్థులు సాయంత్రం పూట పంక్చర్ అయిన సైకిళ్లను నడిపించుకుంటూ నీరసంగా ఇళ్లకు వెళ్తూ కనిపిస్తున్నారు. పాఠశాల మైదానం సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా పాఠశాలలో సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంటున్నారు.



చెట్ల నీడన నిలిపి ఉంచిన విద్యార్థుల సైకిళ్లు

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..

పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 495 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే ఇంటర్మీడియట్‌లో 185 మంది ఉన్నారు. మొత్తంగా పాఠశాలలో 687మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల మైదానంలో ఇప్పటికే ఖోఖో, కబడ్డీ కోర్టులు ఏర్పాటుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తీసుకున్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తారు. అలాగే రక్షణగోడ, సైకిల్ స్టాండ్ ఏర్పాటు, ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అనుకుంటున్నాం.

– రుక్సానా పర్వీన్, ప్రిన్సిపాల్

సీలింగ్ లేని వైద్య విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

- ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు సీలింగ్ లేని వైద్య విధానాన్ని ప్రభుత్వం వర్తింపజేయాలని ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సంఘం జోనల్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాబ్ సెక్యూరిటీ సర్క్యులర్‌కి సంబంధించిన జీవో 1/2019ను మరల అమలు చేయాలని కోరారు. సీలింగ్ లేని వైద్య విధానాన్ని అమలు చేయాలని, నైట్ డ్యూటీ వేతనాలను జీతంలో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. పాడైపోయిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనాలని, ఆర్టీసీలో నిలిపివేసిన స్కీములను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు విడనాడాలని, పీఎఫ్, పెన్షన్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఖాళీలను భర్తీ చేయాలని, అన్ని రూట్లలో బస్సులు పునరుద్ధరించాలని, ట్రాఫిక్ పెరిగినందున రన్నింగ్ టైం పెంచాలని కోరారు. సమావేశంలో జోనల్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, కార్యదర్శి బి.ఎస్.రాములు, రాష్ట్ర కార్యదర్శి కె.నర్సింగరావు, ఎస్.సమ్మయ్య, విజయనగరం జిల్లా అధ్యక్షుడు పీజీ రాఫిల్, ఆరు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు 8 దరఖాస్తులు

పూసపాటిరేగ: దీపావళి మందుగుండు సామగ్రి విక్రయాలకు తాత్కాలిక లైసెన్సుల కోసం మండలం నుంచి 8 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ తాడ్డి గోవింద తెలిపారు. పూసపాటిరేగ–6, పేరాపురం–1, కనిమెట్ట–1 నుంచి దరఖాస్తు వచ్చినట్లు వెల్లడించారు. వాటిని పరిశీలించి ఆర్డీఓ అనుమతి కోసం పంపించామన్నారు. ఈ ఏడాది దీపావళి మందుగుండు సామగ్రి అమ్మకాల కోసం తాత్కాలిక లైసెన్సులు పొందిన వారంతా తప్పనసరిగా జీఎస్టీ ఫైల్ చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు.

30న వయోవృద్ధుల దినోత్సవం

విజయనగరం అర్బన్: సీనియర్ సిటిజన్లు సమాజానికి అందిస్తున్న అమూల్యమైన సేవలను గుర్తిస్తూ, వారిని గౌరవించేలా ఏటా అక్టోబరు 30న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఆ శాఖ సహాయ సంచాలకులు జి.వి.బి.జగదీష్ తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అలరించిన భక్తిగీతాలాపన

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన అధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు అధ్యాంతం ఆహుతులను అలరించాయి. స్థానిక మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడిలో భీష్మారావు సారథ్యంలో నిర్వహించిన భక్తిగీతాలాపన ఆలరించింది. రైల్వే స్టేషన్ వనంగుడి వద్ద ప్రముఖ మెజీషియన్ శ్రీనివాస పండిట్ సుమారు రెండున్నర గంటల పాటు తన మేజిక్, వెంట్రిలాక్విజమ్‌తో ఆకట్టుకున్నారు. అనంతరం ఈవో డి.వి.వి.ప్రసాదరావు కళాకారులను ఘనంగా సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు సర్పంచులకే అప్పగించాలి



వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ సన్యాసినాయుడు, తదితరులు

నెల్లిమర్ల: గ్రామాల్లో చేపట్టనున్న ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ వర్క్స్ తమకే అప్పగించాలని మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ రామకృష్ణరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తించిన వెండర్ ఐడీ పనులు కూటమి నాయకులకు ప్రభుత్వం అప్పగించడం చట్టవ్యతిరేకమన్నారు. గ్రామాల్లో చేపట్టే ఉపాధిహామీ పనులు సర్పంచుల ద్వారానే జరగాలన్న నిబంధనను ప్రభుత్వం తుంగలోకి తొక్కాలని చూస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పనులు సర్పంచులకే అప్పగించాలని కోరారు. లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేగాన శ్రీనివాసరావు, రేవల్ల శ్రీనివాసరావు, రెడ్డి సత్యనారాయణ, తర్లాడ దుర్గారావు, అట్టాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

నెల్లిమర్ల: మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండగుంపాం కార్యదర్శి లెంక తౌడు, ప్రధాన కార్యదర్శిగా సీతారామునిపేట కార్యదర్శి కె.బంగార్‌రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి, కోశాధికారిగా సురేష్, సహ కార్యదర్శిగా సంతోష్ కుమార్, ఈసీ మెంబర్లుగా మోహన్, సత్యం, వెంకటరావు, శ్రీనివాసరావును సభ్యులు ఎన్నుకున్నారు. ఈవోపీఆర్డీ శంకర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఎంపీడీఓ రామకృష్ణ రాజు, ఏఓ, తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

రతన్ టాటా గొప్ప మానవతావాది



రక్తందానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రతన్ టాటా గొప్ప మానవతావాది అని ఎస్వీఎన్ గ్రూప్ సంస్థల అధినేత జి.శివకుమార్ అన్నారు. స్థానిక ఎస్వీఎన్ లేక్ ప్యాలేస్‌లో మంగళవారం గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తగా రతన్ టాటా ఎంతో కీర్తి ప్రతిష్ఠలు సంపాధించారన్నారు. ఎంత ఎదిగిన ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతమని కొనియాడారు. ఆయన వ్యాపార దక్షత నేటి యువ వ్యాపారవేత్తలకు, యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఎస్.రామారావు, అబ్దుల్ రవూఫ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి



డ్రోన్ సాయంతో మోదవలస రహదారిని పరిశీలిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు, సిబ్బంది

డెంకాడ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలోని చింతలవలస జంక్షన్, బొడ్డవలస పెట్రోల్ బంక్ ఎదురుగా, జొన్నాడ జంక్షన్ టీ పాయింట్ వద్ద, మోదవలస ఫ్రెష్ ఛాయిస్, లింగాలవలస ఆశ్వినీ హోటల్, నాతవలస టోల్‌ప్లాజా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించారు. డ్రోన్ సాయంతో ఆయా ప్రాంతాల ఫొటోలను తీశారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ ఎన్‌వీ ప్రభాకర్

భోగాపురం: మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా టపాసుల దుకాణాలను నిర్వహిస్తే వాటిని గుర్తించి వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ ఎన్‌వీ ప్రభాకర్ సచివాలయ మహిళ పోలీసులకు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సచివాలయ మహిళ పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా టపాసుల దుకాణాలను నడపరాదని అన్నారు. అనుమతులు తెచ్చుకున్నవారు గ్రామానికి దూరంగా జన సంచారం లేని ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమలు చేయడంతో చాలామంది గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం ఉందని, దీనిపై నిఘా పెట్టాలని, మీ పరిధిలో బెల్టు షాపులు నిర్వహించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎస్సైలు సూర్యకుమారి, పాపారావు పాల్గొన్నారు.

మోక్షమెప్పుడో..



నిర్మాణ దశలో ఉన్న సామాజిక ఆస్పత్రి

- నత్తనడకన సీహెచ్‌సీ నిర్మాణ పనులు
- ఐదేళ్లయినా పూర్తికాని వైనం
- ఇబ్బందులు పడుతున్న వైద్య సిబ్బంది, రోగులు
- గదులు లేకపోవడంతో మూలకు చేరుతున్న ఖరీదైన పరికరాలు

నెల్లిమర్ల: సామాజిక ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం ప్రారంభమై ఐదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు పూర్తికాలేదు. 2019 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆస్పత్రి భవనాల నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించడంతో గుత్తేదారు పనులు ప్రారంభించారు. 60 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. అయితే నిధులు విడుదల కాకపోవడంతో మిగతా పనులు నిలిచిపోయాయి. దీంతో వైద్య సిబ్బంది, రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు, ఇతర రోగులు ఒకే గదిలో ఉంటూ వైద్య సేవలు పొందుతున్నారు.

మూలకు చేరిన వైద్యపరికరాలు

నెల్లిమర్ల సామాజిక ఆస్పత్రికి రోజుకు సుమారు 200 నుంచి 300 వరకు రోగులు వస్తున్నారు. 30 పడకలు ఆస్పత్రి అయినప్పటికీ 14 బెడ్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన 16 బెడ్లు మూలకు చేరాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో 50 మందికి పైగా వైద్యులు, సిబ్బంది సేవలందిస్తున్నారు. పూర్తిస్థాయిలో గదులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ఇరుకు గదుల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆస్పత్రి వరండాలోనే ఓపీ నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలతో రోగులకు ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. ఇన్–పేషెంట్లు ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నెలకు సరాసరి 20 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. అలాగే మందులు, వైద్యపరికరాలు ఉన్నప్పటికీ గదులు, సౌకర్యం కొరత వల్ల వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. భవనాల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆస్పత్రికి అదనంగా వచ్చిన బెడ్లు, వైద్య పరికరాలు పాడవుతున్నాయి. ఎక్స్‌రే ప్లాంట్ ఉన్నా గది సౌకర్యం లేక వినియోగంలోకి రాలేదు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఎక్స్‌రే తీయలేక క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేయాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సామాజిక ఆస్పత్రి అదనపు గదుల నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



కొత్తగా మంజూరైన బెడ్లు



వినియోగంలోకి రాని ఎక్స్‌రే మిషన్, చిన్నపిల్లల వైద్య పరికరాలు

మెరుగైన సేవలు అందిస్తాం..



ఆస్పత్రి నిర్మాణం ప్రారంభమై ఐదేళ్లు దాటింది. దీంతో ఉన్న గదుల్లో బోటు సరిపోక ఇబ్బందులు పడాల్సివస్తోంది. ముఖ్యంగా గర్భిణులు, సాధారణ రోగులు ఒకే వార్డులో ఉండాల్సి వస్తోంది. అలాగే ఎక్స్‌రే మిషన్ ఉన్నా దాన్ని ఏర్పాటు చేసేందుకు గది లేకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు, న్యూమోనియా రోగులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేయాల్సి వస్తోంది. అదనపు గదులు అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుంటుంది.

– వినోద్‌కుమార్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా ఇవ్వండి అంటూ ఎస్.కోట పట్టణంలో ఎస్ఎఫ్ఐ నాయ కులు, విద్యార్థులు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రటరీ కె.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలు నానాటికీ అధ్వానంగా తయారవుతున్నాయని, ప్రభుత్వ యంత్రాంగం తీరు దున్నపోతు మీద వానపడ్డ తీరున ఉందన్నారు. తల్లికి వందనం పథకంపై స్పష్టత కరువైందని వాపోయారు. హాస్టళ్లలో మరుగుదొడ్లు, స్నానాల గదులు, ప్రహరీలు, ఫ్యాన్లు, దోమతెరలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని చోట్ల వాచ్‌మెన్లు, కమాటీలు, కుక్‌ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని, డిగ్రీలో హానర్స్ విధానం రద్దు చేయాలని, మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే దుశ్చర్యలు ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాదీవెన, వసతిదీవెన బకా యిలు రూ.3,480 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ బాలికల విభాగం కో–కన్వీనర్ వి.భార తి, జిల్లా కమిటీ సభ్యులు ఏ.అను, వి.చరణ్, మండల అధ్యక్షుడు పి.రత్నంనాయుడు, సభ్యులు ఇంద్ర, అనిత, చరణ్ జి.కార్తీక్, రవి తదితరులు పాల్గొన్నారు.